## క్లుప్తంగా

### పటిష్ట భద్రత నడుమ 'పది' ప్రశ్నపత్రాలు

రూట్ అధికారి బుచ్యానాయక్



పరీక్ష పేపర్‌లు అప్పగిస్తున్న రూట్ అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): ఈ నెల 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదో తరగతి ప్రశ్న పత్రాలు, ఇతర సామగ్రిని పటిష్ట బందోబస్తు నడుమ భద్రపరిచామని రూట్ అధికారి బుచ్యానాయక్ తెలిపారు. బుధవారం ఆయన శివంపేట ఎంఈఓ బుచ్యానాయక్, సహాయక రూట్ ఆఫీసర్ సామ్యనాయక్‌తో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌లకు ప్రశ్నపత్రాలను అందజేశారు. వాటిని సబ్జెక్ట్‌ల వారీగా బాక్స్‌ల్లో భద్రపరిచి సీల్ వేశారు. అనంతరం బాక్సులను స్టేషన్‌లోని ఓ గదిలో భద్రపరిచారు. వెల్దుర్తి మండలంలో రెండు పరీక్ష సెంటర్‌లు, తూప్రాన్ మండలంలో ఏడు, శివంపేట మండలంలో నాలుగు సెంటర్‌లకు సంబంధించి ప్రశ్నపత్రాలను ఆయా మండలాల్లోని పోలీస్‌స్టేషన్‌లలో భద్రపరిచినట్లు బుచ్యానాయక్ చెప్పారు.

### కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సోమక్కపేట్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విఠల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత నెలలో నర్సాపూర్‌లో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దీపిక, నిహారిక, శ్రీవాణి ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించారన్నారు. ఉపాధ్యాయులు భానుకిరణ్, శ్యాంసుందర్, రాజ్‌కుమార్, డేవిడ్‌రాజ్, సంగీత విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ నవీన్ ఉన్నారు.

### వీడియో కాన్ఫరెన్స్‌లతో రైతులకు ఉపయోగం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

రామాయంపేట(మెదక్): స్థానిక రైతువేదికలో వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయం ప్రారంభమైంది. హైదరాబాద్‌లో నుంచి సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా రైతులు వీక్షించారు. ఈ విధానం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంపొందుతుందని, విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధన ఫలితాలు ఎప్పటికప్పుడు రైతులకు చేరుతాయని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రామాయంపేట, నర్సాపూర్, కుల్చారం రైతువేదికల్లో ఈ కార్యక్రమం ప్రారంభమైందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఏడీఏ విజయనిర్మల, మెదక్, రామాయంపేట వ్యవసాయ డివిజన్ల పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### 'గృహజ్యోతి' నమోదు



జీరో బిల్లు కోసం ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి గృహ జ్యోతి ద్వారా జీరో బిల్లుల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు మూడు రోజుల నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడంతో బుధవారం నుంచి ఈ నమోదు చేపట్టారు. ఇప్పటి వరకు 456మంది జీరో బిల్లుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారి వివరాలు నమోదు కావడంతో వారందికీ జీరోబిల్లు వర్తించిందని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సిబ్బంది స్వామి, జీవన్ తదితరులు ఉన్నారు.

# రెచ్చిపోతున్న రియల్ మాఫియా

**కబ్జాలకు పాల్పడుతూ వెంచర్లు**

- భూముల కోసం పన్నాగాలు
- చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

**మండలంలో రియల్ ఎస్టేట్ మాఫియా రెచ్చిపోతోంది. రైతుల భూములపై కన్నేసి కాజేసేందుకు చాలా రకాలుగా పథకాలు పన్నుతోంది. దానికి రియల్ వ్యాపారులు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఇతర వ్యక్తులను పావులుగా వాడుకుంటున్నారు. యథేచ్ఛగా భూములను కబ్జాచేసి వెంచర్లు వేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు.**



ధర్నా చేస్తున్న చిన్నగొట్టిముక్ల రైతులు(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో రియల్ ఎస్టేట్ మాఫియా తమ ఇష్టరాజ్యంగా భూ కబ్జాలకు పాల్పడుతూ అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుడడంతో వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. శివ్వంపేట మండలం హైదరాబాదుకు 50కిలో మీటర్ల దూరంలో ఉండడంతో పాటు హెచ్‌ఎండీఏ పరిధిలోకి రావడంతో ఇక్కడి భూములకు ధరలు విపరీతంగా పెరిగాయి. ఇదే అదునుగా రియల్ వ్యాపారులు అసైన్డ్ భూములను సైతం తక్కువ ధరలకు కొనుగోలుచేసి రికార్డులను మార్పుచేసి అమ్మకాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ దందాకోసం నిబంధనలు పాటించడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన కూడళ్లలో పెద్దపెద్ద బోర్డులు ఏర్పాటుచేసి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. శివ్వంపేట, సికింద్లాపూర్, చిన్నగొట్టిముక్ల, దొంతి, కొంతన్‌పల్లి తదితర గ్రామాల్లో వెంచర్లు ఏర్పాటు చేశారు.

**అక్రమాలకు వ్యూహాలు**

కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం జీవనోపాధి కోసం వలస వెళ్లడంతో వారికి సంబంధించిన భూములను కాజేయాలని రియల్ ఎస్టేట్ మాఫియా పథకం వేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. గృహజ్యోతి పథకం పేరిట వారి సంతకాలు(వేలి ముద్రలు) సేకరించేందుకు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రాములు ప్రయత్నించగా అడ్డంగా దొరికిపోవడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన పలువురు రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములు ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేశారని 8రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేశారు. 1982లో 26 మంది రైతులకు సర్వే నంబర్లు 293, 294, 295, 296, 297లో 50 ఎకరాల 27 గుంటల భూమిని సాగు కోసం ప్రభుత్వం అసైన్డ్ చేసింది. ఈ ఘటనకూడా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.

**తీగలాగి డొంక కదిలించాలి**

రియల్ మాఫియాపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి పూర్తిస్థాయిలో తీగలాగి డొంక కదిలించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతుండడంతోపాటు పట్టాదారుకు ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలి**



కొంతన్‌పల్లి– పోతులబోగూడ ప్రధాన రోడ్డుకు ఆనుకుని మా అమ్మ సులోచన పేరిట ఉన్న ఎకరా పరంబోగు భూమిని ఆక్రమించుకునేందుకు రియల్ వ్యాపారులు పథకం పన్నారు. బాధ్యులను గుర్తించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. – రాయేల్లి శ్రీనివాస్, కొంతన్‌పల్లి

**పొజిషన్‌కు వెళ్లలేదు**

చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన పలువురు రైతులకు అప్పటి ప్రభుత్వం 1982లో బడా భూస్వాముల నుంచి పట్టా భూమి తీసుకుని అసైన్డ్ చేసింది. పట్టాలు పొందిన రైతులు పొజిషన్‌కు వెళ్లలేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. – శ్రీనివాస్‌చారి, తహసీల్దార్

**1982లో పట్టాలు ఇచ్చారు**



ప్రభుత్వం సాగు కోసం 1982లో గ్రామానికి చెందిన 26మంది రైతులకు అసైన్డ్ భూముల పట్టాలు ఇచ్చారు. ఇందులో కొంత భూమి రియల్ వ్యాపారులు ఆక్రమించి వెంచర్ వేశారు. – కర్రె రాజయ్య, చిన్నగొట్టిముక్ల

**కేసు నమోదు చేశాం**

కొంతన్‌పల్లిలో రాయేల్లి సులోచనకు సంబంధించిన భూమిని కాజేసేందుకు ఆమె వేలిముద్రల కోసం ప్రధాన పాత్ర పోషించిన ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ రాములుపై కేసు నమోదు చేశాం. ఇందులో మరికొందరి పాత్ర ఉంది. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి వారిని గుర్తిస్తాం. – మహిపాల్‌రెడ్డి, ఎస్‌ఐ

## రూ.19లక్షలతో కొబ్బరి అమ్మకాలకు టెండర్



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి గ్రామ సమీపంలోగల నల్లపోచమ్మదేవి ఆలయం వద్ద రూ.19లక్షలకు కొబ్బరి కాయల టెండర్ జరిగింది. ఆలయంవద్ద ఏడాదిపాటు కొబ్బరి కాయలు అమ్మేందుకు ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. రూ.5లక్షల చొప్పున నలుగురు డిపాజిట్‌చేసి వేలంపాటలో పాల్గొన్నారు. అందులో తునికి గ్రామానికి చెందిన బండ ప్రవీణ్‌గౌడ్ రూ.19లక్షలకు సొంతం చేసుకున్నారు. గత వారం నిర్వహించిన వేలంలో తునికి హరిచంద్ తండా పంచాయతీ దేవులతండాకు చెందిన శ్రీను రూ.27.60లక్షలకు వేలం పాటలో సొంతం చేసుకున్నప్పటికీ అతను ముందుకు రాకపోడంతో అధికారులు దానిని రద్దు చేశారు. వేలం సందర్భంగా అతడు చెల్లించిన రూ.1లక్ష డిపాజిట్‌ను దేవదాయశాఖ బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు ఈఓ తెలిపారు. గత ఏడాది కంటే రూ.9.25లక్షలు ఆదాయం తగ్గింది. కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సాయిగౌడ్, సాయిలు, మాజీ ఉపసర్పంచ్‌లు మాణిక్యరెడ్డి, శేఖులు, శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



ఎంపీపీ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం

అల్లాదుర్గం(మెదక్): 'గృహ జ్యోతి కొందరికేనా' అనే శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు విద్యుత్ బిల్లులు రావడంతో మండల పరిషత్, విద్యుత్ కార్యాలయం చూట్టూ స్థానికులు తిరుగుతున్నారు. సాక్షి వెలుగులోకి తేవడంతో సమస్యలు పరిష్కరించేందుకు సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ శంకర్ తెలిపారు.

## మహిళా దివ్యాంగుల రక్షణకు కృషి చేయాలి

- ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్షురాలు యశోద



సమావేశంలో మాట్లాడుతున్న యశోద

మెదక్ కలెక్టరేట్: మహిళా దివ్యాంగుల రక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఎన్‌పీఆర్డీఓ జిల్లా అధ్యక్షురాలు యశోద డిమాండ్ చేశారు. బుధవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో మహిళా విభాగం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా దివ్యాంగులపై వివక్షత, వేధింపులు జరగడం సిగ్గుచేటన్నారు. స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. 23, 24న హైదరాబాద్‌లో జరగనున్న దివ్యాంగుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ స్వరూప, సభ్యులుగా దుర్గ, వెంకటమ్మ, కేశమ్మ, చంద్రమ్మ, కవిత, యాదమ్మ ఎన్నికయ్యారు.

## సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామంలో వెలసిన కామేశ్వరీదేవి సమేత సంఘమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. మహాశివరాత్రి నుంచి ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో మొదటి రోజైన 8న త్రికాల అర్చన, గణపతి పూజ, సుప్రభాతం, తటాక స్నానం, రుద్రాభిషేకం; 9న జలపందిరి, బండ్లు తిప్పుట, రాత్రి యక్షగానం; 10న బండి శిడి, రాత్రికి యక్షగానం; 11న అన్నదానం, తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పూరిగుడిసె దగ్ధం

- బూడిదైన రూ.5వేలు, 2 తులాల బంగారం



దగ్ధమవుతున్న గుడిసె

కౌడిపల్లి(నర్సాపూర్): అర్ధరాత్రి పూరిగుడిసె దగ్ధమవడంతో రైతుకూలీ కుటుంబం రోడ్డున పడింది. ఈ ఘటన మండలంలోని దేవులపల్లితండా సమీపంలో జెల్లబాయ్‌తండాలో జరిగింది. బాధితులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గూగ్లోత్ వినోద్ వ్యవసాయ కూలీతో పాటు జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా భార్యతో కలిసి వేరే గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి అతని గుడిసెకు మంటలు అంటుకున్నాయి. తండావాసులు గమనించి ఆర్పడానికి ప్రయత్నించినా పరిస్థితి చేయిదాటిపోయింది. దీంతో గుడిసెలోని రూ.5వేలు, రెండు తులాల బంగారు గొలుసు, 40 తులాల వెండి ఆభరణాలు వంటసామగ్రి, బియ్యం, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. దీంతో అతడి కుటంబం రోడ్డున పడింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవొచ్చని చెపుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షురాలు వాణి



చెక్కులను అందిస్తున్న ప్రజాప్రతినిధులు

టేక్మాల్(మెదక్): గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అందరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీటీసీ ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు నిమ్మ వాణి పిలుపునిచ్చారు. బుధవారం టేక్మాల్ రైతువేదికలో ఎంపీపీ చింత స్వప్న అధ్యక్షతన 36 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంత్రి దామోదర రాజ నర్సింహ ఆధ్వర్యంలో మండలం అభివృద్ధి చెందుతోందన్నారు. గడిచిన రెండు నెలల్లోనే రూ.20కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామని చెప్పారు. జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు యూసుఫ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు మజహర్, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, నారాయణరెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దిన్, వ్యవసాయాధికారి రాంప్రసాద్, ఆర్‌ఐ సాయిశ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మరమేశ్, నాయకులు సాగర్, కిషోర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

## ప్రమాదం అంచున ప్రయాణం



బైక్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తూ..

శివ్వంపేట(నర్సాపూర్): నిత్యం ప్రమాదాలు సంభవించి కళ్ల ముందే ప్రాణాలు పోతున్నా చాలా మంది కళ్లు తెరుచుకోవడం లేదు. బుధవారం నర్సాపూర్– వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై ఓ రైతు తన బైక్‌పై మూడు ఎరువుల బస్తాలు వేసుకొని వాటిపై ఓ వ్యక్తిని కూర్చోబెట్టుకుని వెళ్లడం కనిపించింది. సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## అత్యవసర పనులు వెంటనే చేపట్టాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

నర్సాపూర్: ప్రజలకు అవసరమైన అత్యవసర సేవలను చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆదేశించారు. బుధవారం ఆయన అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, కమిషనర్ జైత్‌రాంనాయక్, మేనేజర్ మధుసూదన్, మిషన్ భగీరథ డీఈఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ లక్ష్మీపతి, పీఆర్ ఏఈ స్వామిదాస్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, కౌన్సిలర్లు సురేశ్, రాజేందర్, బుచ్చేశ్‌యాదవ్, యాదగిరి, రాంచందర్, రుక్కమ్మ, సునీత, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాల కవాతు



మెదక్ మున్సిపాలిటీ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కేంద్ర బలగాలతో మెదక్ పట్టణంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ రాజేశ్వర్, పట్టణ సీఐ దిలీప్‌కుమార్, 50 మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పశ్చిమ బెంగాల్ ఘటనకు నిరసనగా రాస్తారోకో



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రామాయంపేట (మెదక్): పశ్చిమ బెంగాల్‌లో ఊచకోతకు బాధ్యులైన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్‌చేస్తూ ఏబీవీపీ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. బుధవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్ మాట్లాడుతూ ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై అరాచకాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నోరు మెదపడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళనలో సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ టీపీఎస్‌డీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ పంచాయతీ క్యాదర్శుల జిల్లా ఫోరం క్యాలెండర్, డైరీలను బుధవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ ఆనంద్, ఎంపీఓ శరత్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యాం కుమార్, ఈసీ భగవాన్‌రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా జాయింట్ సెక్రటరీ తిరుపతి, స్పోర్ట్స్ సెక్రటరీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**◆ నంబరు ప్లేట్‌లేని బైక్‌ల సీజ్**

నర్సాపూర్: నంబరు ప్లేట్‌లు, డాక్యుమెంట్లు లేని వాహనాలను సీజ్ చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ చెప్పారు. ఆయన బుధవారం స్థానిక చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మూడు బైక్‌లకు ఎలాంటి డాక్యుమెంట్లు, నంబరు ప్లేట్‌లు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు.

**◆ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి జైలు**

రామాయంపేట(మెదక్): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఓ వ్యక్తికి ఐదు రోజుల జైలుశిక్ష విధించారు. మంగళవారం రాత్రి మర్కు సురేశ్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని కోర్టుకు తరలించారు. మెదక్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ కల్పన అతడికి ఐదు రోజుల జైలుశిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ రంజిత్ హెచ్చరించారు.

**◆ గ్రామ అవసరాలకు నీటి సరఫరా**

మనోహరాబాద్(తూప్రాన్): వేసవిలో గ్రామ అవసరాలకు నీటిని తన పొలం నుంచి అందజేస్తానని మాజీ ఉప సర్పంచ్ నూకల వెంకటేశం తెలిపారు. గ్రామ కార్యదర్శి శ్రీధర్‌కు బుధవారం హామీపత్రాన్ని అందజేశారు. వేసవి కాలం ముగిసే వరకు తన పొలం నుంచి నీరందిస్తానని ఆయన చెప్పారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

**◆ విద్యాశాఖ నిర్లక్ష్యం వల్లే బియ్యం నిల్వలు**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలో బియ్యం నిల్వలు పేరుకుపోయి పాడైపోవడానికి విద్యాశాఖ సిబ్బంది నిర్లక్ష్యమేనని సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బియ్యం నిల్వల గురించి సాక్షి దినపత్రికలో 'ముక్కిపోయి.. పురుగు పట్టి' కథనం ప్రచురితమైంది. దానిపై ఆయన స్పందించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అక్షయపాత్రకు అప్పగించినప్పటి నుంచి బియ్యం నిల్వలు పేరుకుపోయి పాడైపోయినట్లు చెప్పారు. ఆ బియ్యం విషయం తమశాఖకు సంబంధం లేదని చెప్పారు.

**◆ టెస్ట్ డ్రైవ్ చేసిన సొసైటీ సెక్రటరీ**

నర్సాపూర్: విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సం ఈ బాజా పోటీలలో వినియోగించే వాహనంపై టెస్ట్ డ్రైవ్ చేశారు. బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం నుంచి ఈనెల 11 వరకు జరగనున్న ఈబాజా సైఇండియా 2024 పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ఈవెంట్ ట్రాక్‌పై టెస్ట్‌డ్రైవ్ చేసి పోటీల్లో పాల్గొనే విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. విద్యార్థులకు ఉపయోగపడే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన చెప్పారు.

**◆ పరీక్ష ప్యాడ్‌లు అందజేత**

తూప్రాన్/చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని ఇస్లాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, స్టేషనరీని అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయలన్నారు.

**◆ బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు**

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి కింద పడడంతో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని వెల్మకన్న సమీపంలో జరిగింది. దేవులపల్లికి చెందిన నర్సింహగౌడ్ కౌడిపల్లి రైస్ మిల్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి గ్రామ పల్లెప్రకృతి వనం సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రగాయాలై స్పృహకోల్పోయాడు. ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**◆ విధుల్లో చేరిన ఆర్‌డీఓ**

నర్సాపూర్: ఆర్‌డీఓగా జగదీశ్వర్‌రెడ్డి బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఆర్‌డీఓగా పని చేసిన శ్రీనివాసులు హుజూర్‌నగర్‌కు బదిలీ కావడంతో అక్కడి నుంచి జగదీశ్వర్‌రెడ్డి నర్సాపూర్‌కు వచ్చారు.

**◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

టేక్మాల్(మెదక్): మండలం మల్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రి దామోదర రాజనర్సింహ మంజూరు చేసిన ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.